క్లుప్తంగా

ముస్లింలకు షర్బత్ పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మొహరం సందర్భంగా ముస్లింలకు పంజా సెంటర్ సమీపంలో మహబూబ్ సుభాని జెండా చెట్టు దర్గా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇమామ్ మౌలానా ఖదీర్ చేసిన ప్రార్థనల్లో వెలంపల్లి పాల్గొన్నారు. అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు షేక్ హసన్ బాష (జెడ్ ఎస్ బాషి) మాట్లాడుతూ ఇమామ్ హుస్సేన్ ఆత్మార్పణ దినమైన మొహరంను ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. అసోసియేషన్ కార్యదర్శి అన్సారి, నాయకులు ఖదీర్ భాష, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. పంజాసెంటర్‌లో మొహర్రంను పురస్కరించుకొని స్థానిక ముస్లిం మైనార్టీ నేతలు ఎండీ మెహమూద్, వాజిద్ ఖాన్‌లు షర్బత్ పంపిణీ నిర్వహించారు.

నేడు వీఎంసీ పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలో కూడా నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్‌కు స్టెయిన్ లెస్ స్టీల్ స్క్రీన్ ఏర్పాటు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):గణపతిరావు రోడ్డు కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను సుమారు రూ.30 లక్షల వ్యయంతో మోటార్‌తో కూడిన స్టెయిన్‌లెస్ స్టీల్ స్క్రీన్‌ను ఆదివారం అధికారులు ఏర్పాటు చేశారు. దీనివలన బీఆర్పీ రోడ్డు, గణపతిరావు తదితర ప్రాంతాల మీదుగా వచ్చే మురుగు నుంచి గాంధీహిల్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిలోకి కొంతమేర చెత్త రాకుండా నిలుపుదల చేయటానికి అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే స్థానిక ప్రజలకు డ్రెయినేజీ వలన ఇబ్బందులు లేకుండా నివారించేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజానీకం చెత్తను డ్రెయిన్లలో వేయకుండా ఇంటింటికి వచ్చే నగర పాలక సంస్థ సిబ్బందికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, డీఈ బూసిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెం233లో గెద్దల ప్రభావతి, ప్రసన్నకుమార్ దంపతులు నివాసం ఉంటారు. వీరికి ఇద్దరు అమ్మాయిలున్నారు. పెద్ద కుమార్తె(17) 8వ తరగతి వరకు చదివి, రెండేళ్లగా ఇంట్లోనే ఉంటుంది. ఇంట్లో పనులు చేయకుండా ఎవరితోనో ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుండటంతో తల్లి మందలించింది. దీంతో శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. తెల్లవారేసరికి ఇంట్లో బాలిక లేకపోవడంతో తెలిసిన వారిని, స్నేహితులను విచారించారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నూతన ఆవిష్కరణలతో మెరుగైన చికిత్సలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలని రెయిన్‌బో హాస్పటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాద్ శిష్టా తెలిపారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనెటాలజీ ఫోరం సహకారంతో నేప్–2025 పేరుతో నియోనేటల్ అండ్ పీడియాట్రిక్ ఎమర్జెన్సీస్ సదస్సు ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ నవజాత శిశువులు, చిన్నపిల్లలకు సంబంధించిన అనేక నూతన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలందరికీ చేరువ చేసేందుకు రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కృషి చేస్తుందని తెలిపారు.





కనకదుర్గమ్మా.. కరుణించమ్మా..

తొలి ఏకదాశి పర్వదినం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఏపీతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ఆషాఢసారెను సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. కనకదుర్గమ్మా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మహిళలు ఆషాఢసారెను నెత్తిపై పెట్టుకొని తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







పార్టీ పటిష్టతకు కృషిచేయాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



నాయకులను అభినందిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొత్తగా పదవులు పొందిన నేతలు పార్టీ పటిష్టతకు పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ క్లస్టర్–5తో పాటుగా వివిధ హోదాల్లో పదవులు పొందిన 53వ డివిజన్ నాయకులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాయకులు వెలంపల్లిని సత్కరించారు. వెలంపల్లి నాయకులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ మాజీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు గురుమహంతు మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి బంక చాముండేశ్వరి, నాయకులు సోల్జర్, ఎండీ అన్వర్, ఎండీ ఖాజా. బాయిన కుమార్, ఉగ్గిన కృష్ణారావు, పృథ్వీ, రమేష్, పోతిన యశ్వంత్, పానుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ముస్లింలకు అండగా వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా

వించిపేట(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ అండగా ఉంటారనిఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బాజీబాబా తెలిపారు. ఆదివారం 55వ డివిజన్, వించిపేటలోని తన కార్యాలయంలో మైనార్టీ నేతలతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తే వారి తనయుడుగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో అన్ని రంగాల్లో ముస్లింలకు గౌరవ స్థానం కల్పించారని చెప్పారు. నేడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులతో డాక్టర్‌లుగా, ఇంజినీర్‌లుగా ప్రముఖస్థానాల్లో ఉన్నారంటే అందుకు కారణం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు మోసాలను ఎండకడుతూ 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రెటరీ షేక్ నజీర్, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిని కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర పార్టీ నేతలతో కలిసి బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ వివిధ హోదాల్లో అద్భుత సేవలందించారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, ఉపప్రధానిగా విభిన్న రీతుల్లో దేశ పురోభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ వ్యవసాయం, రైల్వే, తంతి తపాలా, పునరావాస తదితర శాఖల మంత్రిగా వ్యవహరించి వన్నె తెచ్చారన్నారు. ప్రధానంగా ఆయన ఏశాఖలో పని చేసినా దళితుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడ్డారన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరావు, పశ్చిమ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

వించిపేట(విజయవాడపశ్చిమ):దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సత్యబాబు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను రోడ్డుపాలు చేసేలా కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక హక్కుల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని, ప్రజలపై విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలనే డిమాండ్‌లతో సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి ఈ.నారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ కార్యదర్శి వి.సాంబులు, కే.సూరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

జంతువులతో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న వైద్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు, అలాగే మనుషుల నుంచి జంతువులకు వ్యాప్తి చెందే వ్యాధులను జునోటిక్ వ్యాధులు లేదా సంక్రమిత వ్యాధులు అంటారని, అటువంటివాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ హనుమంతరావు అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ, ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ, జీవకారుణ్య సంస్థ (భవానీపురం), సాయిబాబా సత్సంగ సేవా సమితి సంయుక్త నిర్వహణలో ఆదివారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, భవానీపురం ఐరన్ యార్డ్‌లోని జీవకారుణ్య సంస్థలో 563 వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంటహెచ్–1 డాక్టర్ అన్నపూర్ణ, నవోదయ వెట్ సొసైటీ వెటర్నరీ వైద్యులు గంగాభవానీ, రామచంద్రారెడ్డి, సాయికృష్ణ, రవికాంత్, లక్ష్మి, సాయిబాబా సత్సంగ సేవా సమితి పక్షాన మేకా కృష్ణ శేఖర్, జీవకారుణ్య సంస్థ చైర్మన్ మురాల వెంకటేశ్వర్లు, వీఎమ్‌సీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పాండురంగడి కల్యాణం



స్వామి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, మురళీకృష్ణచార్యులు నిర్వహించారు. కల్యాణోత్సవ విశిష్టతను అర్చక స్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): థర్మల్ కాలువ వైపు వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన గొల్లపూడిలో జరిగింది. భవానీపురం పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి ఎస్ఎస్ఎస్ కాలనీకి చెందిన బాలాజీ(23) యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్స్, లైఫ్ ఇన్సూరెన్స్ చేస్తుంటాడు. ఆదివారం ఉదయం థర్మల్ కాలువ వైపు వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తుంటే స్విచాఫ్ వచ్చింది. అనుమానంతో ఆయన సోదరుడు మరి కొందరు కలిసి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు



విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారి సన్నిధిలో స్వామి కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ విభూది, చందనం వంటి 11 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన ఈవో వై.సీ తారామయ్య, ఆలయ ఫౌండర్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావులు ఏర్పాట్లు చేశారు. భీమన వారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో విజయదుర్గాంబికా దేవికి భక్తులు సారెను సమర్పించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భీమన వారి పేటలోని గంగానమ్మకు, చిట్టినగర్ మమాలక్ష్మీ అమ్మవారికి, కుండల మార్కెట్ గంగానమ్మకు సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వెన్నం రజనీకుమార్, సెక్రటరీ పవన్‌కుమార్, కోశాధికారి బాబూరావు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టినగర్ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో...
చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తులసీ దళ అర్చన నిర్వహించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థాన కమిటీ కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కోటి తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. విష్ణు సహస్రనామాలతో భక్తులు తులసీదళాలతో స్వామి వారికి పూజలు చేశారు. కల్యాణవేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి శాంతి కల్యాణం నిర్వహించారు. అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, పరాశరం బాలముకుందాచార్యులు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకృష్ణార్జునల వారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి వారి దేవస్థానంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలంటూ భర్త, మామ వేధిస్తున్నారంటూ మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు చెందిన గజ్జి శ్రీవాణికి రెడ్డి గూడెం మండలం పాత నాగులూరుకు చెందిన రామకోటేశ్వరరావుతో 2018లో వివాహమైంది. ఆ సమయంలో రూ. 4 లక్షలు కట్నం ఇచ్చారు. వివాహానికి ముందే ఆమెకు బొల్లి మచ్చలు ఉన్నాయి. పెళ్లి చూపుల్లో అవి చూసుకునే పెళ్లికి అంగీకరించారు. పెళ్లయిన తర్వాత రెండు నెలలు వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత భర్త రామకోటేశ్వరరావు, మామ నాగేశ్వరరావు వేధించ సాగారు. అయినప్పటికీ సర్దుకుపోతూ కాపురం చేసింది. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత వేధింపులు మరింత అధికమయ్యాయి. బొల్లి ఉన్నా పెళ్లి చేసుకున్నానని, అదనపు కట్నం ఇవ్వాలని మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ నేపథ్యంలో పిల్లలను తీసుకుని పుట్టింటికి చేరింది. ఆమె పుట్టింటికి వచ్చినా పలు రకాలుగా వేధించడం, అనుమానంతో అవమానించడం చేయసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

- పీరుల ఉత్సవాన్ని నిర్వహించిన ముస్లింలు
- కళకళలాడిన పంజా సెంటర్



పంజా సెంటర్‌లో లంకపిర్ పంజా కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు



పీరుల ఉత్సవంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని పంజా సెంటర్ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీగా తరలివచ్చి పీరుల చావడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక లంకఫిర్ పంజా ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి పంజా సెంటర్‌లో అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. అగ్నిగుండాలను స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు నిర్వహించి వాటిని వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ మొక్కులను తీర్చుకున్నారు. శనివారం రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము వరకూ భక్తుల కోలాహలం మధ్య పలు కార్యక్రమాలు నిర్వహించారు. డప్పుల హోరులో ముస్లింలు నిప్పుల్లో నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు బొమ్మలు, తినుబండరాలను విక్రయించారు.

మొయిన్‌బజార్‌లోని పీరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పీరుల చావడి వద్ద వేడకలను నిర్వహించారు. కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో అగ్నిగుండాలను ఏర్పాటు చేసి నిప్పులపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. త్యాగాలకు చిహ్నం మొహరం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పంజా సెంటర్‌లో జరిగిన మొహరం కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముస్లింలంతా అత్యంత భక్తి శ్రద్ధలతో పవిత్రంగా జరుపుకునే కార్యక్రమం మొహరం అని అన్నారు.హైకోర్టు సీనియర్ అడ్వకేట్ డాక్టర్ ఎంవీ రాజారాం, వెస్ట్ డివిజన్ ఏసీపీ దుర్గారావు, కొత్తపేట సీఐ చిన కొండలరావు, లంకా పీర్ పంజా రస్ హుస్సేని, హాజీ ముతావల్లి ఎస్‌కే జిలాని సైదా, ముజావర్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలమురళీ కృష్ణ జయంతి



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జీవీఆర్ సంగీత కళాశాల, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత కళాశాల గుంటూరు ఆధ్వర్యాన దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం సంగీత విద్వాంసుడు పద్మవిభూషణ్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి, డీవీ మోహనకృష్ణ సంగీత కచేరీ, ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగళంపల్లి ఆత్మీయ మిత్రుడు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ తెలుగు వారి సంగీత చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మంగళంపల్లి అని అభివర్ణించారు. భాషా సాంస్కృతిక శాఖ సీఈవో ఆర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ 2026 జనవరిలో అమరావతి సంగీతోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం మోహన కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సృజనాత్మక సమితి సహాయ సంచాలకులు పెంచలయ్య, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ కే లక్ష్మీనరసమ్మ, గుంటూరు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మార్టూరి హరిబాబు, సంగీత విద్వాంసులు, అధ్యాపకులు పాల్గొన్నారు. దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళంపల్లి జయంతి సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరీలు మధురంగా సాగాయి.